
# సంపెంగ పూదండ



## కథ

**జీవితంలో ఏదీ శాశ్వతం కాదంటారు. ప్రేమలూ, అనుబంధాలూ, పెళ్లిళ్లూ...**

**నేను పెళ్లి అయినా శాశ్వతం అనుకున్నాను. ఎందుకంటే జ్యోతిర్మయి నాకు పరిచయం అయి నా జీవితంలోకి ప్రవేశించినపుడు ఆమె నాకు శాశ్వతంగా దక్కితే చాలని, జీవితానికి అదే పదివేలని అనుకున్నాను.**

ఆమె నాకు దక్కడమూ, దూరం కావడమూ కూడా జరిగిపోయింది. కాలం మనుషులను కలుపుతుంది. కాలం మనుషులని విడదీస్తుంది కూడా. మానవత్వం కూడా కొందర్ని కలిపి, కొందరిని విడదీస్తుందని నా ఉదాహరణలో నేను తెలుసుకున్నాను. అందుకు మానవత్వంపైన నాకు ఆగ్రహమేమీ లేదు.

ఒక వ్యక్తికి కొత్త జీవితం, నూతనోత్సాహం, జీవశక్తి, మానసిక ఆనందం తెప్పించిన నా మానవత్వం నన్ను జ్యోతిర్మయికి దూరం చేసిందని నాకు కోపం లేదు.

ఎందుకంటే మానవత్వం ఒక మనిషిలో, న్యూనతతో బాధపడే వ్యక్తిలో ఇంత పాజిటివ్ భావాలు కలిగించగలదని నేను అనుకోలేదు. ఆ విషయం ఇప్పుడు తెలిశాక నాకు ఆనందంగానే ఉంది.

ముదిగొండ శివకౌముదీ దేవి

మానవత్వం అనే ప్రమిద కాంతి ఎంత దూరం వ్యాపించగలదో, ఒక దీపం ఎన్ని దీపాలను వెలిగించగలదో నేను తెలుసుకున్నాను.

★ ★ ★

ఒకరోజు ఐ.సి.సి.ఆర్. ఆర్ట్‌గ్యాలరీలో నేను తంజావూరు చిత్రాల ప్రదర్శన చూస్తున్నాను. ఆ చిత్రకారుడు రామశాస్త్రి నా మిత్రుడు. అతడు తంజావూరు చిత్రాల ప్రత్యేకతని, దానిని తయారుచేసేందుకు తాను ఎంత శ్రమ పడ్డాడో ప్రెస్ వారికి వివరిస్తున్నాడు. ప్రెస్ వారిలో బెంగాల్ కాటన్ చీర- నల్లరంగుకి పసుపు బార్డర్ ఉన్నది కట్టుకుని, మెడలో పెద్ద పూసల దండ వేసుకున్న పొడుగు జడ అమ్మాయి నన్ను ఆకర్షించింది.

చకచకా నోట్స్ రాసుకుంటోంది.

తర్వాత మళ్లీ అదే గ్యాలరీలో నా ఇంకో ఫ్రెండ్ జాకబ్ తన చిత్రకళా ప్రదర్శన

ఏర్పాటు చేశాడు. అతని చిత్రాల్లో మధువనీ పెయింటింగ్స్, కొలాజ్ పద్ధతిలో చేసినవి, ఇంక్ డ్రాయింగ్స్, ఉడ్ ఇన్‌లే వర్క్ పద్ధతిలో చేసిన గ్రామీణ జీవిత చిత్రాలు ఉన్నాయి. నేను ఒక్కో చిత్రం దగ్గరా ఆగి ఆసక్తిగా, పరిశీలనగా చూస్తున్నాను. అవి నేను ఒక పత్రికలకు స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసే రోజులు. కవరేజికి వెళ్లాను. అప్పుడు జాకబ్ ఆ అమ్మాయిని నాకు పరిచయం చేశాడు. ఈసారి తెల్లటి చుడీదార్ పైన నీలం ఓణీ వేసుకుంది. తను జ్యోతిర్మయి, హిందీ లెక్చరర్. పత్రికల్లో ఆర్ట్ విషయాలపై వ్యాసాలు రాస్తుంది. ఫ్రీలాన్స్ జర్నలిస్టు అని చెప్పాడు.

అట్లా మా పరిచయం పెరిగింది. ఇద్దరం కలిసి రవీంద్రభారతిలో నంది నాటకోత్సవాలు, పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో నాట్యోత్సవాలకి వెళ్లేవాళ్లం.

కొంత కాలానికి మా పెళ్లి జరిగింది. తను ఒక డిగ్రీ కాలేజీలో హిందీ లెక్చరర్‌గా స్థిరపడింది. నేను సీనియర్ రిపోర్టర్ అయి, ప్రస్తుతం ప్రిన్సిపల్ కరస్పాండెంట్ అయ్యాను. మాకు పిల్లలు లేరు. పెళ్లయి పదేళ్లవుతోంది.

నాకు డిగ్రీలో ఉండగా క్లాస్‌మేట్ ప్రతిమ. ఇద్దరం డిగ్రీలో బిజడ్‌సి గ్రూపు తీసుకోవడం వల్ల ఒకే క్లాసు. ప్రతిమకి ఒక కాలికి పోలియో. అందువల్ల బాగా నడవలేకపోయేది.

తను తర్వాత ఎంఎస్సీ బోటనీ చదివిందట. తనూ ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా చేరింది. తనకి తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరర్‌గా వచ్చింది. పి.హెచ్.డి చేసింది బోటనీలో.

డిగ్రీ పూర్తయ్యాక దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత మేం అరకులోయలో కలిశాం.

నేనూ, జ్యోతిర్మయీ అరకులోయ చూసేందుకు వెళ్లాం. ప్రతిమ తన విద్యార్థులను బొటానికల్ టూర్‌కి తీసుకు వచ్చిందట. కొద్దిసేపు మాట్లాడుకుని విజిటింగ్ కార్డులు ఎక్స్ఛేంజి చేసుకున్నాక విడిపోయాం.

ఒక రోజు న్యూనాగోల్‌లో ఉన్న ప్రతిమ ఇంటికి నేనూ, జ్యోతిర్మయి వెళ్లాం. చుట్టూ అందమైన చిన్న పూల తోట, కొబ్బరి, అరటి, మామిడి, గన్నేరు, మందార, మల్లె, జాజిమొక్కలు. గేట్ పక్కనే అందమైన, దట్టమైన సంపెంగ పొద. దాన్నిండా విచ్చుకున్న ఆకుపచ్చని సంపెంగ పూలు.

ఏదో ఒకనాడు ఆ సంపెంగపూలే నా జీవితాన్ని మలుపుతిప్పుతాయని ఆ రోజు అనుకోలేదు.

ప్రతిమ మమ్మల్ని చూసి ఆనందించింది. మాకు మంచి ఆతిథ్యమే ఇచ్చింది. చాలాసేపు మా కాలేజీ మిత్రుల వివరాలు చెప్పుకున్నాం. చీకటి పడ్డాక మేం బయలుదేరుతుంటే ప్రతిమ వాళ్ల తోటలోని జాజిపూలు, మల్లెపూలు సంపెంగపూలు కూడా ఇచ్చింది జ్యోతిర్మయికి. లోన్ తీసుకుని ఆ ఇల్లు కట్టుకున్నాననీ చెప్పింది.

★ ★ ★

ఆ తర్వాత నేను ఎప్పుడైనా యూనివర్సిటీలో ఏదైనా సెమినార్ కవరేజికి వెళ్లినప్పుడో, లేకపోతే వాళ్ల ఇంటికి దగ్గరలో ఉన్న మా బాబాయి ఇంటికి వెళ్లినప్పుడో, ప్రతిమ ఇంటికి వెళ్లేవాడిని.

రానురానూ మా మధ్య స్నేహం పెరిగింది. తన అంతరంగం నాకు తెలుస్తూ ఉండేది మాటల్లో.

ప్రతిమ పెద్ద అందగత్తె కాదు. కానీ నల్లగా ఉన్నా తన ముఖంలో కళా, కాంతీ ఉన్నాయి. పెళ్లి కాలేదనే బాధ తన మాటల్లో తెలిసేది.

ఆ రోజు ఆదివారం, నాకు వీక్లీ హాలీడే. నేను వాళ్ల ఇంటికి వెళ్లగానే, మబ్బులు కమ్ముకువచ్చి వర్షం మొదలైంది. నేను వెళ్లేసరికి ప్రతిమ సెంటర్ టేబుల్ మీద కుప్పగా ఉన్న సంపెంగ పూలతో దండ అల్లుతోంది. పూలకి దారం చుడుతూ చకచకా ఆ మాల అల్లుతుంటే తన చేతివేళ్ల నైపుణ్యం చూసి ముచ్చటేసింది. ఒకపక్క పచ్చలరాశి పోసినట్లున్న సంపెంగ పూల కుప్ప. ఆ గది ఆ సుమగంధంతో గుబాళిస్తోంది.

కిటికీలోంచి శీతవాయువులు ప్రసరిస్తున్నాయి. ఆ గాలిలో బయట తోట లోంచి పూల సువాసనలు, తడిసిన చెట్ల ఆకుల గాఢ సుగంధం తేలివస్తోంది.

నాతో మాట్లాడుతూనే ప్రతిమ సంపెంగ దండ అల్లడం పూర్తి చేసింది. ఆ గదిలో ఒక మూలగా మురళీ కృష్ణుడి దారు శిల్పం ఉన్నది. అంతకుముందు



## 'శివాజీ'లో మరో ఎట్రాక్షన్

**రజనీకాంత్ సినిమా 'శివాజీ' ఇప్పటికే అనేక ఆకర్షణలతో సంచలనాలు సృష్టిస్తోంది. వాటికి తోడుగా అన్నట్టు ఇప్పుడిందులో నయనతార ఐటమ్ నంబర్ తోడవుతోంది. హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌గా వచ్చే ఓ పాటలో నయనతార రజనీకాంత్‌తో డాన్సులు చేస్తుందట. తొలిచిత్రం 'చంద్రముఖి'లో రజనీతో కలిసి నటించిన నయనతార మళ్లీ రజనీకాంత్‌తో ఇప్పుడీ ఐటమ్ నంబర్ చేస్తోంది. ఈ డాన్స్ 'శివాజీ'కి మరో ఎట్రాక్షన్ అవుతుంది.**

ఆ విగ్రహానికి మల్లెపూల దండ వేసింది ప్రతిమ.

''ఈ సంపెంగ దండ ఎవరికి?'' అన్నాను యధాలాపంగా.

''కృష్ణుడికే'' అన్నది ప్రతిమ.

''కృష్ణుడికి ఒక దండ వేశారుగా'' అన్నాను.

''మరి? ఇంకెవరికి వేయను, మీ మెడలో వేస్తే ఊరుకుంటారా? స్వీకరిస్తారా ఈ నల్లపిల్లని, ఈ అవిటిదాన్ని?'' అన్నది ప్రతిమ.

ఒక్క క్షణం నేను అప్రతిభుణ్ణే అయ్యాను.

ఆమె అట్లా ఛాలెంజింగ్‌గా అడిగినందుకో, ఆమెలోని ఆత్మన్యూనతా భావాన్ని అంత ఓపెన్‌గా బయట పెట్టుకున్నందుకో నాకు ఏమి మాట్లాడుతున్నదీ తెలియలేదు.

''వేసి చూడు'' అన్నాను.

ఒక్క క్షణం ఆమె దండని స్వీకరించి, దండతో పాటూ ఆమెని దగ్గరికి తీసుకుని తనలో ఉన్న న్యూనతను, అభద్రతను, అశాంతిని, పోగొట్టాలనిపించింది.

ఆ క్షణంలో నాకు పెళ్లయిందనీ, ఇంటి దగ్గర నా కోసం జ్యోతిర్మయి ఎదురుచూస్తూ ఉంటుందనీ తోచలేదు.

అంతకాలంగా ఆమె న్యూనతని వింటూ, వింటూ ఉండటంతో ఆమె పట్ల నాలో ఎప్పటి నుంచో ఏర్పడి ఉన్న జాలి, దయ, కరుణ నాలో వెల్లువలా పొంగి నా మనస్సును ముంచెత్తాయి.

ఆమె న్యూనతను, అభద్రతను పోగొట్టేందుకు, మానవత్వంతో ఆమె కోసం ఏదైనా చేయాలనిపించింది.


ఆ క్షణంలో నేను పురుషుణ్ణే తను స్త్రీ అని నాకు తట్టలేదు. తను స్త్రీ అనే విషయం ఎవరూ గుర్తించలేదనే ఆమె బాధ. స్త్రీగా ఒక పురుషుడితో గుర్తింపబడాలనే ఆమె ఆకాంక్ష - మనస్సు అంతరాళంలో ఉన్న కోరిక - మగతోడు కావాలని, అంత ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాననే ఆమె పలుకుల వెనక ఉన్న బాధ -

అప్పుడు నాకు అర్థమై నేను ఒక అచేతన స్థితిలో ఆ మాట అనేశాను.

''నిజంగానా?'' అన్నది ప్రతిమ ఆశ్చర్యంగా, నమ్మలేనట్లుగా.

''ఊ'' అన్నాను.

ఆమె కదిలి నా దగ్గరకు రావడం




కష్టం గనుక నేను నడిచి వెళ్లి తన ముందు నుంచున్నాను.

ప్రతిమ ఆ దండ నా మెళ్లో వేసింది. నేను తిరిగి ఆ దండ ఆమె మెళ్లో వేశాను.

''మనకి పెళ్లి అయినట్లే'' అన్నది ప్రతిమ, కళ్లల్లో నీరు చిప్పిల్లుతుండగా.

''అవును'' అన్నాను.

''మరి నన్ను స్వీకరిస్తారా?'' అన్నది.

''ఊ'' అన్నాను.

ఆ విధంగా ఆ మధ్యాహ్నం మా మధ్య శారీరక సంబంధం ఏర్పడింది.

ఆమె ఒంటరితనాన్ని, దుఃఖాన్ని, అభద్రతను, న్యూనతను పోగొట్టాలనే ఉద్దేశ్యంతో, పరిపూర్ణమైన కరుణతో తనని స్వీకరించాను.

★ ★ ★

ఆ తర్వాత తెలిసింది ఆమె మానసికంగా చికిత్స తీసుకుంటోందని అని.

ఒక రోజు తను సైకియాట్రిస్ట్ దినకర్ దగ్గరికి తీసుకువెళ్లింది నన్ను.

ఈ అమ్మాయి తన పేషెంట్ అనీ, ఆమె నన్ను పెళ్లి చేసుకున్నాక సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఉందనీ, దాన్ని కాపాడమనీ అన్నాడు దినకర్.

దినకర్ జ్యోతిర్మయికి కజిన్.




మా పెళ్లి చేయించిన వాడు. అయినాగానీ వృత్తి పట్ల అతని నిబద్ధతకు నేను ఆశ్చర్యపోయాను.

జోహార్లు అర్పించాను.

ఆ సంగతి జ్యోతిర్మయితో చెప్పినప్పుడు - తను మూగబోయినట్లు నా వైపు చూసింది.

చాలాసేపు మౌనంగా కూర్చుంది.

ఆ తర్వాత ''నీకు డైవోర్స్ ఇస్తానులే, తనతోనే ఉండు'' అన్నది.

ఆ విధంగా మేం విడిపోయాం.

ఆవిధంగా ప్రతిమ పట్ల నేను చూపించిన మానవత్వం మమ్మల్ని విడదీసింది.

అయినా నాకు సంతోషమే.

ఒక ఒంటరి స్త్రీని, వికలాంగురాలిని, న్యూనతతో, అభద్రతతో బాధపడుతున్న మానసిక వ్యాధిగ్రస్తురాలిని మళ్లీ మామూలుగా చేసినందుకు సంతోషమే నాకు. కానీ- అంతరాళంలో ఏదో ఒక మూల ఒక గిజిగాని గూడు వలే అల్లుకున్న నా ఇల్లు సుడిగాలికి కూలిపోయిన భావన లేకపోలేదు.

నేను జ్యోతిర్మయి విడిపోయి, మేం కలిసి నిర్మించుకున్న లైబ్రరీ, కలిసి కొనుక్కున్న చిత్రాలు, శిల్పాలు ఫర్నిచర్ పంచుకుంటుంటే నాకు విచారమే కలిగింది. కానీ మా కలిసి ఉన్న వాళ్ల స్మృతిగా ఆ వస్తువులు నా ఇంట్లో ఒక పురావస్తు ప్రదర్శనశాలలో వలే ఉంటాయనుకున్నాను. ఆ మాటే నేను జ్యోతిర్మయితో అన్నప్పుడు ఆమె నా వైపు ఎంతోసేపు దీర్ఘంగా, నిశ్చలంగా, ఆర్తిగా, ఆగ్రహంగా, జాలిగా చూసింది.

'నీవు చూసే చూపులో.....ఎన్నెన్ని అర్థాలు ఉన్నవో', అనే పాత పాట మనస్సులో మెదిలింది. నాకు కాలం ఆ క్షణంలో ఆగిపోయినట్లు తోచింది. ప్రతిమకి నా రాక వసంతంగా తోచింది. జ్యోతిర్మయికి నేను తన జీవితంలో నుంచి వెళ్లిపోవడం శిశిరం రాకగా తోచింది. వసంతమే శిశిరం కావడం, శిశిరమే వసంతం కావడం అభాస.

ఒకరికి వసంతం అయ్యే పరిణామం ఒకరికి శిశిరం అవుతుందా?

నాకు అర్థం కాలేదు.

అర్థం అయినట్లూ ఉంది. అర్థం కానిది అర్థం అయినట్లు తోచడమూ ఒక అభాసే (పారడాక్స్). జీవితమే ఒక అభాసగా తోచింది.